

మూడు రోజులుగా తాగునీరు లేదు

ప్రజాశక్తి - చింతలపూడి

పట్టణంలోని సుప్రీం పేటలో మూడు రోజులుగా తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటార్ మరమ్మతులకు గురైందని, నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి కోసం అల్లాడిపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. రాత్రి 12 గంటలకు కూడా బిందులు పట్టుకుని నీళ్ల వస్తాయని పంపుల దగ్గరే పడుగాపులు కాస్తున్నామని చెబుతున్నారు. మోటార్‌కు మరమ్మతులు చేయడానికి ఇన్ని రోజులు ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


తాగునీటి కోసం బిందెలతో స్థానికులు

శవాలను పీక్కుతింటున్నారు..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం విభాగంలో ఘోరం

చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం చేయాలంటే సొమ్ము కట్టాల్సిందే


రూ. 5 వేలు ఇస్తేనే పోస్టుమార్టం..లేకపోతే లేదంటున్న పరిస్థితి

జిజిహెచ్‌లో నెలకు దాదాపు 45 మృతదేహాలకు పోస్టుమార్టం

దిక్కుతోచని స్థితిలో కుటుంబీకులు, బంధువులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు సర్వజన ఆసుపత్రి పోస్టుమార్టం విభాగంలో అత్యంత దారుణమైన పరిస్థితి కొనసాగుతోంది. తమ ధన దాహానికి మృతదేహాలను సైతం వదలని పరిస్థితి నెలకొంది. జాలి, దయ అనేది లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం చేసేందుకు అక్కడి వైద్యులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుట్టెడు బాధలో ఉన్న కుటుంబీకులు వైద్యుల తీరు చూసి ఇదేం దారుణమంటూ కన్నీరుమున్నీరవుతున్నారు. నిరుపేదల కుటుంబీకులైతే అడిగినంత డబ్బు సమకూర్చలేక నానాయాతన పడుతున్న పరిస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంతో పేరుగాంచిన ఏలూరు జిల్లా ఆసుపత్రి బోధనా ఆసుపత్రి (మెడికల్ కాలేజీ)గా మారిన తర్వాత అక్కడి పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, పురుగుల మందు తాగిన కేసులు ఎక్కువగా ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తుంటాయి. చికిత్స అందించినప్పటికీ ఒక్కోసారి పరిస్థితి వికటించి మరణిస్తున్నారు. అలా మృతి చెందిన కేసుల్లో పోస్టుమార్టం తప్పనిసరి అవుతోంది. మృతుడు స్వస్థలానికి సంబంధించిన విఆర్‌ఒ, సంబంధిత మండలానికి చెందిన పోలీసులు వచ్చి శవ పంచనామా చేసి రిపోర్ట్‌ను తయారు చేస్తారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులు పోస్టుమార్టం చేయడం జరుగుతోంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు పోస్టుమార్టానికి సంబంధించి ఎటువంటి ఇబ్బందీ ఉండేది కాదు. బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి ఘోరంగా తయారైందంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. పోస్టుమార్టం చేసేందుకు చనిపోయిన వ్యక్తి కుటుంబం నుంచి రూ.ఐదు వేల వసూలు చేయడం అంతటా హాట్‌టాపిక్‌గా మారింది. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పోస్టుమార్టం చేసేందుకు రాకుండా వైద్యులు మొరాయిస్తున్నట్లు మృతుని బంధువులు చెబుతున్న పరిస్థితి. ఆసుపత్రి లెక్కల ప్రకారం ప్రతినెలా 45 నుంచి 50 వరకూ పోస్టుమార్టాలు జరుగుతున్నాయి. ఒక్కో మృతదేహానికి రూ.ఐదు వేలు వసూలు అంటే దాదాపు రూ.2.50 లక్షలకుపైగా వసూళ్ల ప్రక్రియ సాగుతోంది. ఇదంతా యథేచ్ఛగానే సాగిపోతోంది. మామూలుగా అయితే పోస్టుమార్టం చేసిన తర్వాత మృతదేహాన్ని ప్యాక్ చేయడానికి చాప వంటి కొన్ని వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి రూ. 1500 వరకూ ఖర్చవుతోంది. అక్కడి వరకూ ఇవ్వడానికి పెద్దగా ఇబ్బంది లేదు. పోస్టుమార్టం చేసే వైద్యులకు రూ.ఐదు వేలు ఎందుకివ్వాలన్న ప్రశ్న అందరినీ వెంటాడుతోంది. డబ్బులు ఇవ్వకపోతే పోస్టుమార్టం ఆలస్యం కావడం, తర్వాత డెత్ సర్టిఫికెట్ ఇవ్వరన్న భయంతో డబ్బులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసే విభాగం

పోలీసులతో ఒత్తిడిచేసి వసూలు

పోస్టుమార్టం చేసే వద్ద వసూలు అంతా అక్కడికొచ్చిన పోలీసులతోనే వైద్యులు చేయిస్తున్నారంటూ చర్చ సాగుతోంది. ఏదైనా మృతదేహానికి సంబంధించిన ప్రక్రియలో ఎస్‌ఐ, లేకపోతే ఎఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుల్ ఎవరో ఒకరు హాజరు కావాల్సి ఉంటుంది. అనేక పని ఒత్తిళ్ల కారణంగా కొన్నిసార్లు ఎస్‌ఐలు రాలేకపోతున్న పరిస్థితి కొనసాగుతోంది. చనిపోయిన కుటుంబం నుంచి డబ్బులు వసూలు చేసి ఇచ్చే బాధ్యత పోలీసులకే వైద్యులు అప్పగిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒకవేళ పోలీసులు నిరాకరిస్తే ఎస్‌ఐను తీసుకురండని, లేకపోతే ఏదో ఒక కాగితం లేదంటూ ఇబ్బంది పెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులకు సైతం ఏంచేయాలో తెలీక పోస్టుమార్టం చేసే వైద్యులకు డబ్బులు ఇవ్వాలంటూ చనిపోయిన కుటుంబ సభ్యులపై ఒత్తిడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డబ్బులు ఇవ్వపోతే పోస్టుమార్టం ప్రక్రియ నిలిచిపోతుందన్న భయం కుటుంబీకులను వెంటాడుతోంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేసే వైద్యులకు రూ. లక్షల్లో వేతనాలు ఉంటాయి. అయినప్పటికీ మృతదేహాలకు పోస్టుమార్టంలో డబ్బులు వసూలు చేయడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహం ప్యాక్ చేయడానికి రూ. రెండు వేలు, పోస్టుమార్టం చేసినందుకు రూ.ఐదు వేలు తప్పనిసరిగా కట్టాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. పోస్టుమార్టం చేసేవద్ద ఎవరికీ డబ్బులు ఇవ్వక్కర్లేదని బోర్డులు పెట్టి, ఎవరైనా డబ్బులు అడిగితే ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయండని అక్కడి అధికారులు ఎందుకు చేయడంలేదో అర్థంకావడం లేదు. సామాన్య కుటుంబీలకు చెందిన వారైతే డబ్బులు కట్టలేకపోతున్నారు. దీంతో ఊళ్లో గ్రామ పెద్దలు డబ్బులు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్తున్న పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. దీనిపై ఏలూరు సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ హనుమాన్ నాయక్‌ను డబ్బులు వసూలుపై వివరణ కోరగా సూపరింటెండెంట్ వచ్చాక తెలియపరుస్తామని, పోస్టుమార్టానికి డబ్బులు కట్టనవసరం లేదని ఆయన తెలిపారు.

డబ్బులు వసూలు చేయడం తప్పు

పి.సావిత్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్

డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. పోస్టుమార్టానికి డబ్బులు వసూలు చేయడం తప్పు. పోస్టుమార్టం అంతా ఉచితంగా చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈసేవలన్నీ ఉచితమే. దీనిపై తెలుసుకుంటాను.

యధావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు


ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సేవలను సోమవారం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశం మందిరంలో ఈనెల 8వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో అమలవుతున్న ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ప్రభుత్వం ఇప్పుడు వికేంద్రీకరించింది. దీని ద్వారా ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల కార్యాలయాల్లో, డివిజనల్ కార్యాలయాల్లో, లేదా మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణం సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి కోరారు.



ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులుగా మనోజ్, లెనిన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్ఎఫ్ఐ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా బి.మనోజ్, కె.లెనిన్ ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా మహాసభ ఆదివారం ముగిసింది. ఈ మహాసభలో నూతన కమిటీగా 17 మంది ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులు మనోజ్, లెనిన్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని, దీనికి విద్యార్థులందరూ సహకరించాలని కోరారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని హాస్టళ్ల పరిసర ప్రాంతాలు సరిగ్గా లేవని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించడం లేదని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని ప్రాంతాల్లో బస్సు సౌకర్యాలు, తదితర సమస్యలపై పని చేస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం రాగానే విద్యాసంస్థల్లోకి రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు రాకూడదని సర్క్యులర్ ఇచ్చారు, అయితే మెగా పేరెంట్స్ డే మీటింగ్ రోజున విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పొలిటికల్ వాతావరణం తీసుకొచ్చారని అన్నారు. రానున్న రోజుల్లో విద్యా రంగ సమస్యలపై విస్తృత పోరాటాలు చేస్తామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.జయంత్, ఎస్.శివాజీ, ఎస్.పవన్, కె.అమూల్య, సహాయ కార్యదర్శిగా డి.నాగేంద్ర, జి.రమ్య, పి.సతీష్, జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.శివ, ఎస్.రాజు, బి.వీరేంద్ర, సరిత, శేషాద్రి సందీప్ చరణ్, నాని ఎంపికయ్యారు.


మనోజ్


లెనిన్

కోడి పందాలు, జూదాలు అరికట్టాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో జరిగే కోడిపందాలు, జూదాలను ఈ సంవత్సరం అయినా పోలీసులు అరికట్టే చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. భారత ప్రజాతంత్ర యువజన సంఘం ఏలూరు నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం సంఘం కార్యాలయంలో నాయకులు ఎ.శరత్ చంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.సూర్యకిరణ్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి రాష్ట్రంలో, ప్రధానంగా ఏలూరులోనూ విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయని, డ్రగ్ కల్చర్ విపరీతంగా పెరుగుతోందని, దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడినటువంటి నెల్లూరు జిల్లా యువజన నాయకుడు పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేయడం అత్యంత బాధాకరమని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించాల్సింది పోయి నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. పండుగల పేరుతో యువతను మత్తుకు, మద్యానికి బానిసలుగా చేసే విధానాలు విడనాడాలని హితవు పలికారు. యువతరానికి హానికరం అయిన కోడిపందాలు, గంజాయి, జూదాలు అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే గంజాయి పై ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆర్భాటపు ప్రకటనలు మానుకుని కోడి పందాలను నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షులు పి.శివశంకర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో గంజాయి కల్చర్ నిర్మూలించడానికి ఏలూరు యువత ముందుకు రావాలని యువతను కోరారు. అలాగే ఏలూరు జాతర సందర్భంగా ఆటల పోటీలు, సేవ కార్యక్రమాలు నిర్వహిస్థామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు పంపన రవి కుమార్, జె.గోపి, డివైఎఫ్ఐ నగర నాయకులు మనోజ్, లోకేంద్ర, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్

నూజివీడులో స్క్రబ్ టైఫస్?

లక్షణాలతో ఉన్న వ్యక్తిని విజయవాడ తరలింపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి జ్వరంతో నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం చేరాడు. అయితే శుక్ర, శనివారం కూడా వైద్య సేవలందించినా జ్వరం తగ్గుముఖం పట్టకపోవడంతో స్క్రబ్ టైఫస్ అనే అనుమానంతో అతనిని మెరుగైన వైద్య సేవల కోసం అతనిని శనివారం రాత్రి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ ఉదయ్ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ క్రిమి ద్వారా సంక్రమిస్తుందని తెలిపారు. మొదటగా దద్దుర్లు, జ్వరం, దగ్గు, వాంతులు, కడుపునొప్పి, విరోచనాలు వంటి లక్షణాలు స్క్రబ్ టైఫస్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఇవే లక్షణాలు సాధారణ జ్వరాలకు కూడా ఉంటాయని, ల్యాబ్ పరీక్షల అనంతరం నిర్ధారించి తగు వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. మెరుగైన వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తామని చెప్పారు. స్క్రిప్ టైఫస్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, ఆందోళన వద్దని సూచించారు. లక్షణాలు ఉంటే సమీపంలోని ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

టీచర్లకు టెట్ వద్దని 9, 10 తేదీల్లో నిరసన : యుటిఎఫ్

ప్రజాశక్తి - దెందులూరు

ఏళ్లుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహించడాన్ని నిరసిస్తూ ఈ నెల 9, 10 తేదీల్లో నిరసన ర్యాలీలు నిర్వహించాలని యుటిఎఫ్ జిల్లా శాఖ నిర్ణయించింది. సెలవు దినాల్లో కూడా 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 18న జిల్లా స్థాయిలో ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే వీటిపై ఎంపీలకు వినతి పత్రాలు ఇచ్చినట్టు సమావేశంలో చర్చించారు. యుటిఎఫ్ ఏలూరు జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.ముస్తఫాలీ అధ్యక్షతన దెందులూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశంలో నూతన అధ్యక్షులుగా బి.సుభాషిణి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రవికుమార్, గౌరవాధ్యక్షులుగా ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వరరావు, ఎస్.సుధారాణి, కోశాధికారిగా జివి.రంగమోహన్, కార్యదర్శులుగా ఎ.విక్టర్, ఎ.రాజు, పి.వీరకోటి, బి.అనురాధ, ఇ.శివశంకరరావు, నంబూరి రాంబాబు, సిహెచ్ శ్రీధర్, జి.దేవానందరావు, కె.కమల్ కుమార్, ఎం.రవిశంకర్, జి.అంజన, ఐ.దుర్గాప్రసాద్, బి.బాలకృష్ణ, కె.దామోదర్, ఆడిట్ కన్వీనర్‌గా బి.మోహన్‌రావు ఎన్నికయ్యారు.


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ట్రిపుల్ ఐటిలో బాలిక అదృశ్యం


ఆలస్యంగా వెలుగులోకి

లభ్యమైన ఆచూకీ

కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) పరిధిలో కొనసాగే ట్రిపుల్ ఐటీలో అదృశ్యమైన ఫస్ట్ ఇయర్ పియుసి చదువుతున్న బాలిక ఆచూకీ ఆదివారం లభ్యమైంది. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల ఐదో తేదీ శుక్రవారం సాయంత్రం స్టడీ అవర్ నుంచి హాస్టల్‌కు వెళ్తున్నానని చెప్పిన బాలిక కనిపించకపోవడంతో కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి బాలిక ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణ సిఐ సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు రంగంలోకి దిగి నూజివీడు, మైలవరం, విజయవాడ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానానికి దర్శనానికి వెళ్లి మానసిక ఒత్తిడి నివారణ, ప్రశాంతత కోసం అక్కడే ఉన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నూజివీడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.




పోలవరం జిల్లాలో 'పోలవరం'ను చేర్చాలి

లేకుంటే దశలవారీ ఆందోళనలు

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని గుంజవరం, అమ్మపాలెం, చీమలవారిగూడెం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని కోరారు. పోలవరం నియోజకవర్గంలోని ముంపు మండలాలైన మూడు, పోలవరం నిర్వాసితులకు పునరావసం కల్పిస్తున్న మండలాలు రెండు ఉన్నాయని చెప్పారు. వీటిని కూడా కలిపితే పరిపాలనకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఎన్నికల ముందు రంపచోడవరం, పోలవరం నియోజకవర్గం కలిపి ప్రత్యేక జిల్లా ప్రకటిస్తామని చెప్పారని, పోలవరం నియోజకవర్గాన్ని కలపకపోవడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం షెడ్యూల్ మండలాలను కలపాలని కోరారు. లేకపోతే దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కొర్ల రామిరెడ్డి, ఎం.దుర్గారావు, సూర్యారావు, ఎం.పోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్ఎస్‌వి.రామకృష్ణారావు, జిల్లా కార్యదర్శి ఎ.బంగారయ్య ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో పే రివిజన్ కమిషన్ వేయాలని, ఉద్యోగులకు బాకీపడ్డ డిఎ, పిఆర్‌సి ఏరియర్స్, చాలా ఏళ్లుగాబాకీ పడ్డ సరెండర్ లీవులు, జిపిఎఫ్, ఎపి జిఎల్ఐ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఉద్యోగికి ఎంత సొమ్ము బకాయిలు ఉన్నాయో సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆ డబ్బుతో ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, హెల్త్ కార్డులను మరింత మెరుగుపరిచి నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో చాలా రోజుల నుంచి ఉద్యోగోన్నతులు లేవని, వెంటనే ప్రమోషన్ ఇవ్వాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లాస్థాయి స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జె.గోవిందరావు, ఏలూరు తాలూకా అధ్యక్షురాలు నీలిమ దేవి, వి.పెద్దిరాజు, షేక్ ఖలీల్, పి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, భీమడోలు నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం, ఏలూరు, కొయ్యలగూడెం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు

'పోలవరం' కలపకపోతే పోరాటాలు ఉద్ధృతం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాభిప్రాయాన్ని స్వీకరించాలి

సిపిఎం మండల కార్యదర్శిగా యర్నం సాయికిరణ్

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గంలోని షెడ్యూల్ గ్రామాలు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, గోపాలపురం మండలాల్లోని 28 నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను చేర్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో మేడిపల్లి బాబు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో రవి పాల్గొని మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం లేకపోవడం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కలుపుతూ జిల్లా చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి, పోలవరం లేకుండా జిల్లా ప్రకటన సరికాదన్నారు. నూతన జిల్లా ప్రకటన సందర్భంగా ప్రజాభిప్రాయం లేకుండా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రజాభిప్రాయం మేరకు పోలవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాలో కలపాలని, లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిపిఎం కుక్కునూరు మండల కార్యదర్శిగా యర్నం సాయికిరణ్‌ను మండల కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మోడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఎం నాయకులు యర్నం సాయికిరణ్, భూయ్యాన శ్రీను, పట్ల లక్ష్మయ్య, పూలదాసు రమేష్, శ్యామల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

పెయ్యేరు కాలనీలో కుక్క స్వైర విహారం

కుక్క కాటుతో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెయ్యేరు కాలనీలోని నాలుగో బజారులోని పడమర వీధిలో ఒక మహిళకు సంబంధించిన కుక్క కాలనీలో స్వైర విహారం చేస్తూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. పెంపుడు కుక్కను సదరు మహిళ వీధిలోకి వదిలేయడం వల్ల ఇప్పటికే కాలనీలో చాలా మంది పిల్లలను, పెద్దలను కరిచి గాయపరిచినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఈ పెంపుడు కుక్క వీధిలో నడిచే పాదచారులను, వాహనాల వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తుంది. ముఖ్యంగా మహిళల మీదకు దూకి చీరలను చింపుతూ గాయపరుస్తుండటంతో రోజూ ఆ దారిలో నడిచే జనం హడలిపోతున్నారు. ఈ విషయమై కుక్కను ఇంట్లో నిర్బంధించుకోమనీ స్థానికులు సదరు మహిళను హెచ్చరించినా లెక్క చేయడం లేదంటున్నారు. ఆ మహిళ ఏ మాత్రం బాధ్యత లేకుండా కుక్కను వీధిలోకి వదిలేయడంతో దారిని పోయేవారిని కరుస్తూ గాయపరుస్తున్నట్లు చెబుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారితో ఆ మహిళ అసభ్యంగా వాగ్వివాదం చేస్తోందంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి స్పందించి ఆ కుక్కను సత్వరమే బంధించి పెయ్యేరు కాలనీ ప్రజలు, పసి పిల్లల ప్రాణాలకు హాని కలగకుండా కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.


కల్వర్టుకు చేస్తున్న మరమ్మతులు

దెబ్బతిన్న సిమెంట్ కల్వర్టులకు మరమ్మతులు


ప్రజాశక్తి - ఉంగుటూరు


నారాయణపురంలో స్టేట్ బ్యాంకు వైపు వెళ్లే రోడ్డులో కల్వర్టుపై సిమెంట్ పైప్స్ దెబ్బతిన్నాయి. గ్రామ సర్పంచ్ అలకనంద పంచాయతీ నిధులతో అభివృద్ధి చేశారు. దెబ్బతిన్న సిమెంట్ దిమ్మలను తొలగించి కొత్తగా సిమెంట్ దిమ్మలను కల్వర్టుపై అమర్చారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ కూడలిలో శాశ్వత పరిష్కారం చేయడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో పలుచోట్ల పాడైన కల్వర్ట్ లకు కొత్తగా సిమెంట్ దిమ్మలు వేయించే చర్యలు తీసుకున్నామని సర్పంచ్ తెలిపారు. పనులు మొదలు చేపట్టిన గుత్తేదారు, స్థానిక టిడిపి నేత అల్లిన శేషు, కూటమి నాయకులు, పంచాయతీ పాలక సభ్యులు పాల్గొన్నారు.

హరిపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎంపిపి రామిశెట్టి సత్య నారాయణ అన్నారు. మండలంలోని శ్రీహరి పురం గ్రామంలో సుమారు రూ.11 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపిపి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి పురం గ్రామ సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు నీలం సుబ్బారావు, విష్ణుమూర్తుల నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి


దుప్పట్లు అందిస్తున్న వినోద్

విద్యార్థులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహం విద్యార్థులకు నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ కొడాలి వినోద్ దుప్పట్లు అందించారు. వసతి గృహంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం అందించిన దుప్పట్లు ఒక్కో విద్యార్థికి రెండు చొప్పున 53 మందికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ పి.సురేష్‌బాబు పాల్గొన్నారు..

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రజాశక్తి - చింతలపూడి

టిప్పర్ లారీ రివర్స్‌లో వస్తూ వెనుక బైక్‌పై ఉన్న వ్యక్తిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న బాబు తెలిపిన వివరాల ప్రకారం.. లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామానికి చెందిన చిన్ను వెంకటేశ్వరరావు (60) ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై ధర్మాజీగూడెం బయలుదేరాడు. ఈ క్రమంలో ఆయన కొణిజర్ల గ్రామం శివారులోకి వచ్చేసరికి ఎదురుగా టిప్పర్ లారీ ఆగి ఉండడంతో దాని వెనుక ఆగాడు. ఇంతలో టిప్పర్ లారీ ఎదురుగా మరో వాహనం రావడంతో టిప్పర్ రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న వెంకటేశ్వరరావును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కామవరపుకోట

అనధికారకంగా వాహనంలో తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టుకున్నట్లు మండల సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కె.శేషగిరిరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం తెల్లవారుజామున మండలంలో తడికలపూడి గ్రామం సెంటర్‌లో రెవిన్యూ సిబ్బంది, తడికలపూడి పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్లే వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అశోక్ లైలాండ్ ట్రక్ వ్యానులో అనధికారికంగా పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా సదరు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 80 బస్తాల్లో మొత్తం నాలుగు వేల కేజీల బియ్యం ప్రభుత్వం వారు ఇచ్చిన రేషన్ బియ్యంగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి సదరు బియ్యాన్ని ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు భద్రపరిచి తిరిగి అప్పగించేందుకు తడికలపూడి గ్రామంలోని ద్వారకా సాయి రైస్ మిల్ ప్రొపరేటర్ ఈడుపుగంటి సందీప్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు.



పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

అధ్వానంగా బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం రోడ్డు

దుమ్ముతో వాహనదారుల అవస్థలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో ప్రయాణం చేసేటప్పుడు దుమ్ము వల్ల కనీసం ఎదుట వస్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ప్రజలు ఈ రోడ్డు గురించి అనేకసార్లు నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు పున:ప్రారంభించలేదు. అసంపూర్తిగా పనులు నిలిచిపోవడంతో వాహనదారులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. బూసరాజుపల్లి శివారు కొత్త సింగన్నపల్లి కాలనీ నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ వరకు ఉపాధి హామీ కింద 5.8 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ములో ప్రయాణించడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఏజెన్సీ ప్రాంతం ప్రజల ఇబ్బందుల గురించి ఆలోచించి నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతున్నారు.


దుమ్ముమయంగా ఉన్న రోడ్డు

నిర్మాణ పనులు చేపట్టకపోతే నిరసన

తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు



ఏజెన్సి ముఖద్వారమైన జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం వచ్చే రహదారి పూర్తిగా పాడైపోయింది. కూటమి ప్రభుత్వం నిర్మాణం ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి. లేకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతాం.

రోడ్డు నిర్మాణ పనులు పున:ప్రారంభించాలి

అందుగుల ఫ్రాన్సిస్, కెవిపిఎస్ జిల్లా నాయకులు



నిత్యం ఏజెన్సి ప్రజలు రహదారి గుండా ప్రయాణం చేస్తూ ఉంటారు. రోడ్డు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గర్భిణులు ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసేటప్పుడు ప్రాణభయంతో ఉంటున్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పున:ప్రారంభించాలి.

యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశానికి తరలిన నేతలు, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్‌గా ఉపాధ్యాయుడు పిచ్చోడు

ప్రజాశక్తి - మండవల్లి

యుటిఎఫ్ స్టేట్ కౌన్సిలర్‌గా ఉపాధ్యాయుడు పిచ్చోడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా దెందులూరులో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన యుటిఎఫ్ ఎన్నికల్లో మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సిరిగిరి పిచ్చోడిని ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తూ తీర్మానించారు. ఈ సందర్భంగా మనోహర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన శాఖ యుటిఎఫ్ అని అన్నారు. ఉపాధ్యాయుల పక్షాన నిలబడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులుగా ఉన్న సిరిగిరి పిచ్చోడిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి కార్యవర్గ సభ్యులుగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎంపికైన సిరిగిరి పిచ్చోడు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ శ్రీనివాసరావు, ఆనంద్ కుమార్, ఎండి సుఫీనా, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా శివశంకరరావు

దెందులూరు : యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా ఈడే శివశంకరరావు నాలుగోసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారని నగర అధ్యక్షులు సిహెచ్.షణ్ముఖి, ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు ప్రకటనలో తెలిపారు. దెందులూరు వేదికగా జరిగిన ఎన్నిక ప్రక్రియలో శివశంకర్ రావు ఎన్నిక కావడం సంతోషదాయకమని తెలిపారు.

ఉంగుటూరు సీనియర్ సభ్యుల ఎన్నిక

ఉంగుటూరు : యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఆదివారం నిర్వహించారు. యుటిఎఫ్ ఉంగుటూరు సీనియర్ నాయకులు శీతాల సత్యనారాయణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, ఏలూరు యుటిఎఫ్ కార్యదర్శిగా సిహెచ్.శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు, పిరిడి ప్రసాద్ ఎన్నికయ్యారు. యుటిఎఫ్ ఉంగుటూరు అధ్యక్షులు వునుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు, ఉపాధ్యక్షులు కత్తుల ఝాన్సీ, బొమ్మిడి ప్రసాద్, కోశాధికారి ఊటా ఆనంద కుమార్, ఆడిట్ కన్వీనర్ టి.శ్రీధర్, ఉంగుటూరు మండలశాఖ అభినందనలు తెలిపారు.

జీలుగుమిల్లి : దెందులూరులో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి కౌన్సిల్ సమావేశానికి మండలం నుంచి యుటిఎఫ్ ఉపాధ్యాయులు తరలివెళ్లినట్లు జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఐటిడిఎకు సంబంధించి ఏజెన్సీ ప్రాంత నివేదికను సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా చేర్పించిన యుటిఎఫ్ సభ్యత్వాల్లో మండలం నుంచి అత్యధిక సభ్యత్వాలు చేర్పించి జిల్లాలో ప్రథమ స్థానం సాధించడంతో జెఎసి తరపున బహుమతి అందుకున్నారు. గత నాలుగేళ్లుగా అవార్డు జీలుగుమిల్లి మండలానికి రావడం పట్ల జెఎసితో పాటు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. సమావేశానికి వెళ్లిన వారిలో అల్లాడి రాజుతో పాటు చెన్నారావు, సోమేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాము, తదితరులు హాజరయ్యారు.

దెందులూరు తరలిన యుటిఎఫ్ నాయకులు

ముసునూరు : దెందులూరులో ఆదివారం నిర్వహించిన యుటిఎఫ్ జనరల్ కౌన్సిల్ సమావేశానికి ముసునూరు మండల నాయకులు హాజరై విజయవంతం చేసినట్లు మండల కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు తెలిపారు. యుటిఎఫ్ మండల నాయకులు జి.వెంకటేశ్వరరావు, సహ అధ్యక్షులు బి.అనురాధ, పి.వీరకోటి, జిల్లా కార్యదర్శి కాసాని గంగేయుడు, మండలాధ్యక్షులు జి.పద్మకిషోర్, ఉపాధ్యాయులు తరలి వెళ్లారు.

సహకార రంగంతో మెరుగైన సమాజం

విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ నూజివీడు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా నూజివీడు అమర్ భవన్‌లో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు సహకార సదస్సు నిర్వహించనున్నట్లు నూజివీడు బ్రాంచ్ మేనేజర్ యర్ర శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ముఖ్యఅతిథిగా విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ ఛైర్మన్, నాఫ్కాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు, పలువురు ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. సహకార రంగాన్ని విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని చెప్పారు. సహకార సంఘాలు మెరుగైన సమాజాన్ని నిర్మిస్తాయనే భావనతో ప్రపంచంలో ప్రధాన సమస్యలైన పేదరికం, ఆకలి, ఆర్థిక అసమానతలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక సవాళ్లను ఎదుర్కొవడానికి సహకార రంగ పాత్రను మరింతమంది ప్రజలకు తెలియజేయాలనేదే ప్రధాన లక్ష్యమన్నారు. సహకార సూత్రాలు, విలువలు తూచా తప్పకుండా పాటిస్తూ భారతదేశ అర్బన్ బ్యాంకింగ్ రంగంలో ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ నడుస్తుందని తెలిపారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గాని, ఇతర సంస్థల నుంచి గాని నిధులు తీసుకోకుండా నడుస్తుందన్నారు. సహకార చట్టాలను, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలను పాటిస్తూ పూర్తి స్వయం ప్రతిపత్తితో నడుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది బంక వెంకట శివశంకర్, నక్క రామకృష్ణ, పొట్టిక అన్నవరం, బొబ్బడి శివ గౌరీ నీలిమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖులు

వికలాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వికలాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సిఎం చంద్రబాబు ఇంద్రధనుస్సు పేరిట ఏడు వరాలను ప్రకటించడం వికలాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తేటతెల్లం చేస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు చెప్పారు. వికలాంగుల హక్కులు కాపాడటంతో పాటు వారికి తగిన గౌరవం అందించాలన్న ఏకైక లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. ఏలూరు రామచంద్రరావుపేటలోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఎపి వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా సదస్సు నిర్వహించారు. ఎంఎల్ఎ బడేటి చంటి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ వికలాంగులకు సరైన అవకాశాలు కల్పిస్తే వారు అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయగలరన్న నమ్మకంతో సిఎం చంద్రబాబు వారి సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు మరో ఆరు వరాలను ప్రకటించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వికలాంగుల పెన్షన్ మొత్తాన్ని రూ.ఆరు వేలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఏలూరులో వికలాంగుల భవన్ నిర్మాణానికి తన వంతు సహకారం తప్పకుండా అందిస్తానని హామీ ఇచ్చారు. వికలాంగులకు ఏ అవసరం ఉన్నా తనను నేరుగా కలవవచ్చని, వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ఇంద్రధనుస్సు పేరుతో ఏడు వరాలను ప్రకటించిన సిఎం చంద్రబాబుకు వికలాంగులు రుణపడి ఉంటారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల వికలాంగులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి డిఎస్‌సి ఎసి ఛైర్మన్ జి.నారాయణస్వామి, వికలాంగుల సంక్షేమ శాఖ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబు, జిల్లా అధ్యక్షులు కుందేటి జయరాజు, గౌరవాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, సిపిఐ నాయకులు మన్నవ కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

సింగరాయపాలెంలో అఖండ అన్న సమారాధన

ముగిసిన షష్ఠి మహోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

జిల్లాల ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన సింగరాయపాలెం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ఆదివారం నిర్వహించిన అఖండ అన్న సమారాధనతో ఘనంగా ముగిశాయి. గత నెల 25న స్వామివారిని పెళ్లికుమారుని చేయటంతో ప్రారంభమైన ఉత్సవాలు అఖండ సమారాధనతో ముగిశాయి. ఈ అన్న సమారాధనను కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమారాధనకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా యాత్రికులు తరలి వచ్చి సమాధానంలో పాల్గొన్నారు. యాత్రికులతో సింగరాయపాలెం చేవురుపాలెం సెంటర్ కిటకిటలాడింది. ఈ సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 150 మంది పోలీసులు, పదిమంది సిఐలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సింగరాయపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వివిధ రోడ్లలో వాహనాలను మళ్లింపు చర్యలు చేపట్టారు. అన్న సమారాధన సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. 13 రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో వేలాదిగా యాత్రికులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పుట్టలో పాలు పోశారు. ప్రతిరోజూ ఆలయం వద్ద సంస్కృతిగా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు వివిధ డిపోలకు చెందిన స్పెషల్ ఆర్‌టిసి బస్సులు నడిపారు. వైద్య శిబిరాలు నిర్వహించారు. భారీ అఖండ అన్న సమారాధనకు సుమారు 60 వేల మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా విజయవంతంగా ఉత్సవాలు ముగియడంతో అన్ని శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ అన్న సమారాధనలో ఎన్‌డిఎ కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

పేకాట స్థావరంపై దాడి

ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం. టి.నరసాపురం పంచాయతీలోని ముత్యాలమ్మపేట శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మధ్యవర్తులు, సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2200 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నూతన విత్తన చట్ట ముసాయిదాను ఉపసంహరించాలి

రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన


ప్రజాశక్తి - పోలవరం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన విత్తన చట్ట ముసాయిదాను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని జిల్లెల్లగూడెం పంచాయతీకి చెందిన పేడ్రాల గ్రామంలోని రామాలయం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ గతంలో ఢిల్లీలో జరిగిన మహా రైతాంగ ఉద్యమం తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్ని నెరవేర్చలేదన్నారు. కనీస మద్దతు ధరలపై చట్టం తీసుకురావాలన్న రైతుల ప్రధాన డిమాండ్‌ను ఇప్పటికీ పట్టించుకోకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. సామ్రాజ్యవాద శక్తులకు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా వదిలేయడానికి కేంద్రం తెచ్చిన విత్తన చట్ట ముసాయిదా ఒక ప్రమాదకర ఆయుధమన్నారు. ఇప్పటికే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల (ఎఫ్‌టిఎ) ప్రభావంతో దేశంలో వ్యవసాయ దిగుమతులు భారీగా పెరిగి, దేశీయ పంటలకు మద్దతు ధరలు దెబ్బతిన్నాయని గుర్తుచేశారు. ఇటీవల అమెరికా నుంచి ప్రత్తిని దిగుమతి చేసుకోవడానికి చేసిన ఒప్పందం ప్రత్తి రైతులకు మరింత దెబ్బతీస్తుందని హెచ్చరించారు. విత్తన చట్ట ముసాయిదాను వెంటనే ఉపసంహరించి, భారతదేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు పట్టేం పరమేశ్వరరావు, పోలోజు వెంకటస్వామి పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలంలోని పరింపుడి పశువైద్యశాలలో పశువులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. పశువైద్యశాఖాధికారి బివిఎల్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆవులు, గేదెలు, మేకలకు మఖా, హెచ్ఎస్ వ్యాక్సిన్లు వేశారు. పశువులకు సమయానికి టీకాలు వేయడం చాలా అవసరమని పశువైద్య శాఖకు చెందిన ఎడి శేఖర్ తెలిపారు. రైతులు, పశుపాలకులు తమ పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం తప్పనిసరిగా ఈ టీకా కార్యక్రమాల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు.


నిత్యావసరాలు అందిస్తున్న దాతలు

నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల వచ్చిన తుపాన్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు లూథరన్ మినిస్ట్రీస్ అధినేత జాన్సన్ పాస్టర్, బిషప్ అండగా నిలిచారు. మండలంలో విస్తృత సహాయ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసపురం గ్రామంలోని వంద కుటుంబాలకు, ఉప్పలమెట్ట ప్రాంతంలోని 60 కుటుంబాలకు తక్షణ సహాయం అందించారు. వారి ఆర్థిక సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి కుటుంబానికీ 15 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ నూనెను పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి హాజరై బాధితులకు సరుకులు అందించారు. తుపాను వల్ల నష్టపోయిన కుటుంబాలకు భవిష్యత్తులో కూడా సహాయం అందించేలా కృషి కొనసాగుతుందని బాబ్జి తెలిపారు.

లలిత హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

పేద, మధ్య తరగతి వారికి ఆరోగ్యశ్రీ లేదా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం గుంటూరు లలిత హాస్పిటల్‌లో చేస్తున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. లింగపాలెం మండలంలో విజ్ఞాన భారతి స్కూల్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ సహకారంతో గుంటూరు లలిత హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లలిత హాస్పిటల్‌లో ఒక్కొక్క డాక్టర్‌కు 15 ఏళ్లకు పైగా అనుభవం ఉందన్నారు. నాణ్యమైన వైద్యం అందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఇతర సేవలు కూడా అందుతాయాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతునికి ట్రై సైకిల్

ప్రజాశక్తి - పెదవేగి

అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్ అందించడంతో పాటు వారి సంక్షేమానికి సైతం కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన పరశా మంగయ్య అనే విభిన్న ప్రతిభావంతునికి ఎంఎల్ఎ ట్రై సైకిల్‌ను అందించారు. ఈ సందర్భంగా తనపై ఎంతో ఆప్యాయత చూపిన ఎంఎల్ఎకు పరాసా మంగయ్య ఆత్మీయ కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన భక్తాంజనేయ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో భక్తాంజనేయ స్వామివారి జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు గూటాల ఆలయానికి విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఎంఎల్ఎకు ఆలయ కమిటీ ఛైర్మన్ ఆటపాకుల వెంకటేశ్వరరావు, గూటాల జనసేన సీనియర్ నాయకులు మొగళ్ల హరిబాబు శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో కరిబండి నాగరాజు, కక్కిరాల రాజు, కక్కిరాల వాసు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జనసేన నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా మధు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా కొయ్యలగూడెం మండలానికి చెందిన వామిశెట్టి మధును నియమించినట్లు పోలవరం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా కో కన్వీనర్లుగా డి.మధు, ఎస్.చక్రవర్తి, కె.వెంకట మురళీలను నియమించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. పోలవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ చేసే అభివృద్ధి పథకాలను సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేయాలని పేర్కొన్నారు.